సాక్షి మంచిర్యాల

శుక్రవారం ¦ 4 ¦ జూలై ¦ 2025



మున్సిపల్ వాహనాలు మూలకు..

జిల్లాలో మున్సిపాలిటీల్లో మరమ్మతులు లేక వాహనాలు మూలకు పడ్డాయి. దీంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

5లో ▸



బీఎల్‌వోల పాత్ర కీలకం

ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంలో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు.

5లో ▸

గరిష్టం/కనిష్టం

31.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

నంబరు ప్లేట్లు మార్చాల్సిందే..!

- సెప్టెంబర్ 30 డెడ్‌లైన్
- పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ అమర్చుకోవాలి
- 2019కి ముందు కొన్నవాటికి తప్పనిసరి
- ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ



హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నకిలీ నంబరు ప్లేట్లను అరికట్టడం, రహదారి భద్రతపై సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అన్ని రకాల వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్ (హెచ్ఎస్ఆర్ఎన్‌పీ) తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నంబరు ప్లేట్ల చివరన ఉన్న లేజర్ కోడ్‌ను ట్రాక్ చేసి వాహనదారుడి పేరు, వివరాలు, వాహనం ధ్వంసమైనా లేజర్ కోడ్ ద్వారా వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. 2019 ఏప్రిల్ ఒకటి కన్న ముందు కొనుగోలు చేసిన వాహనాలకు ఈ నంబరు ప్లేటు బిగించని పక్షంలో రోడ్లపైకి వచ్చే అవకాశం ఉండదు. తుది గడువు సెప్టెంబర్ 30లోగా అమర్చుకోవాలని రవాణా శాఖ స్పష్టం చేసింది. లేనిపక్షంలో భారీ జరిమానాలు, శిక్ష విధించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నంబరు ప్లేట్లు అమర్చుకునేందుకు వాహనాల తీరు ఆధారంగా ప్రత్యేక రుసుములు ప్రకటించారు.

కాలం చెల్లిన వాహనాల కట్టడి

కాలపరిమితి ముగిసిన వాహనాలు రోడ్లపై తిరగకుండా రవాణా శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 15ఏళ్ల కాలపరిమితి ముగిసిన వాహనాలను గుర్తించే ప్రక్రియ చేపట్టింది. కాలపరిమితి ముగిసిన వాహనాలు వేర్వేరు నంబరు ప్లేట్లతో రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అనేక వాహనాలకు సకాలంలో సామర్థ్య పరీక్షలు చేయించడం లేదు. ఇకపై అలాంటి వాటికి అడ్డుకట్ట పడనుంది. జిల్లా వ్యాప్తంగా 2019 మార్చి 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు 2,18,246 ఉండగా ఇందులో అన్ని రకాల పాత వాహనాలు అంటే కాల పరిమితి ముగిసినవి మినహా మిగతా వాటికి హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు బిగించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. 2019 ఏప్రిల్ తర్వాత వాహనాలకు ఇప్పటికే హైసెక్యూరిటీ నంబరు ప్లేటు నిబంధన అమలవుతోంది. ఇప్పటివరకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ బిగించుకున్న వాహనాలు 3,02,010 ఉన్నాయి. ఇందులో చాలా వాహనాలు సాధారణ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్నాయి. ప్లేట్ బిగించని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందులు తప్పేలా లేవు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా వేయడం, వాహనం సీజ్ చేయడం చేస్తారు.

మార్పు ఇలా..

పాత వాహనానికి కొత్తగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు పొందాలంటే వాహనదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. https://bookmyhsrp.com వెబ్‌సైట్‌లో వాహనం నంబరు, వాహన రకం, కంపెనీ, జిల్లా తదితర వివరాలు నమోదు చేయాలి. నంబర్ ప్లేట్ షోరూం వివరాలు వస్తాయి. వెంటనే ఆ షోరూంకు వెళ్లి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకుని ఫొటో తీసి మరోసారి వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత వాహనదారుడిపై ఉంది. ఈ విధానంతో నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్లు లేని వాహనదారులు అయోమయానికి గురికానున్నారు.

రుసుం(రూ.లలో) ఇలా..

ద్విచక్రవాహనాలు	300-350
త్రిచక్రవాహనాలు	350-450
కార్లు	550-700
కమర్షియల్ వాహనాలు	600-800

విధిగా అమర్చుకోవాలి



పాత వాహనాలకు కొత్తగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు విధిగా అమర్చుకోవాల్సిందే. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు నిర్ణయించిన ఫీజుతో నంబర్ ప్లేట్ తీసుకోవాల్సి ఉంటుంది. రోడ్లపై తిరిగే ప్రతీ వాహనం హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలి. తనిఖీలో పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. అవసరమైతే బీమా, రిజిస్ట్రేషన్ తదితర సేవలు నిలిపివేసేలా రవాణా శాఖ చర్యలు చేపడుతోంది.

– సంతోష్‌కుమార్, డీటీఓ, మంచిర్యాల

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



చెన్నూర్ సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్ఈ ఉత్తమ్

చెన్నూర్/భీమారం: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉత్తమ్ జాడే అన్నారు. గురువారం ఆయన చెన్నూర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. చెట్ల కొమ్మలు, లూజ్‌లైన్లను సరి చేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భీమారం మండలం నర్సింగాపూర్‌లో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. భీమారం నుంచి నర్సింగాపూర్ వరకు అటవీప్రాంతం గుండా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. భీమారం–నెన్నెల రహదారి గుండా వెళ్లే ఈ లైను రోడ్డుకి ఎంత దూరం నుంచి ఏర్పాటు చేయాల్సి ఉంటుందనేది పరిశీలించారు. అటవీశాఖ అనుమతి పొందేందుకు కలెక్టర్‌ను కలిసి వివరించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే విద్యుత్ లైను వేసే పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈ రాజన్న, ఏడీఈ బాలకృష్ణ, ఏఈలు ఏ.శ్రీనివాస్, శంకర్, ఏఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

మంచిర్యాలటౌన్: ఈ నెల 4న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

న్యూస్‌రీల్

'ప్రాణహిత'లో పెరుగుతున్న నీటిమట్టం



ఇంజన్ పడవలో నది దాటుతున్న ప్రయాణికులు

వేమనపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నదిలో వరద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. వేమనపల్లి పుష్కర ఘాట్ వద్ద రెండు రోజులుగా నది రెండు పాయలుగా ప్రవహిస్తోంది. మహారాష్ట్ర తీరం వైపు ఎక్కువగా, తెలంగాణ(వేమనపల్లి) తీరం వైపు తక్కువగా వరద ప్రవాహం ఉంది. దీంతో నది చూడముచ్చటగా రెండు పాయలతో నిండుకుండలా పారుతోంది. ప్రయాణికులకు రెండు పడవల ప్రయాణం తప్పడం లేదు. వేమనపల్లి వైపు నుంచి నాటుపడవలో కొద్ది దూరం ప్రయాణించి నది మధ్యలో ఇసుక తిన్నెలపై దిగుతున్నారు. అక్కడ నుంచి ఇంజన్ పడవలో నది దాటి అవతలి వైపు ఉన్న మహారాష్ట్ర తీరం వైపు వెళ్తున్నారు ప్రమాదకరమే అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అధిక చార్జీలు చెల్లిస్తూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏడీఏ గోపి



ఏడీఏ గోపి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ శాఖ అదనపు సహాయ సంచాలకులు(టెక్నికల్ సెక్షన్)గా గోపి స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఏడీఏ(టెక్నికల్)గా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ అయ్యింది. జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను కలిసి బాధ్యతలు స్వీకరించారు.

'మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి'



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్ల పాలనతో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో గురువారం సాయంత్రం ఆయన పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి పలు దుకాణాల్లో ప్రధాని చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు అభివృద్ధికి ఎంతగానో సహకరించాయని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. డీపీఆర్‌ను సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా సంబంధిత మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపిస్తే నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

12నుంచి సకల కళల సంబరాల జాతర



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఈ నెల 12, 13వ తేదీల్లో వరంగల్‌లో సకల కళల సంబరాల జాతర నిర్వహించనున్నట్లు రాష్ట్ర జానపద కళాకారుల సంఘం కార్యదర్శి హన్మాండ్ల మధు తెలిపారు. గురువారం ఆయన బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతర పోస్టర్లను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు, కళాకారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 1,116 మంది కళాకారులతో 30 గంటలపాటు ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం నిర్వహిస్తున్న జాతరను కళాకారులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు జాడాల శివ, ప్రధాన కార్యదర్శి పీఆర్ ప్రసాద్, జిల్లా నృత్య కళా సమాఖ్య సభ్యులు ఆర్.అర్జున్, రమేష్, గిరి లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు జంజర్ల దినేష్‌కుమార్, కళాకారులు అర్చన, రాంచందర్, సకినాల రాజేశ్వరరావు, బాలకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం.. సత్ఫలితం



చెన్నూరులో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాలు
- టీబీ, హెచ్ఐవీ, హైపటైటిస్ బీ, బీపీ, మధుమేహం పరీక్షలు
- జ్వరం, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా దేశంలో 2030నాటికి క్షయను సంపూర్ణంగా నివారించాలన్న ఆశయంతో కేంద్ర ప్రభుత్వం వంద రోజుల సమగ్ర ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోంది. క్షయవ్యాధి నిర్ధారణ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామం, పట్టణాల్లోని వార్డుల్లో ప్రతీ రోజు ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. స్థానికంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్షయ, హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, మధుమేహం, బీపీ వంటి పరీక్షలు చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే వేళ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల్లో జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులకూ పరీక్షలు చేస్తున్నారు. ఫలితంగా సీజనల్ వ్యాధుల ప్రభావం జిల్లాలో కొంతమేర తగ్గింది. సమగ్ర ఆరోగ్య శిబిరాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి.. పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. క్షయవ్యాధిపై అనుమానం ఉన్నవారిని ఎక్స్‌రే కోసం 102 వాహనాల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఇంటికి తరలిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆరోగ్య శిబిరాలతోపాటు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలని వివరిస్తున్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించడం, ఇంట్లో ఉన్న నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించడం చేయాలని సూచిస్తున్నారు. డెంగీ, మలేరియా, డయేరియా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వివరిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు దోహదపడుతున్నాయి.

జిల్లాలోని వైద్య శిబిరాల్లో కేసుల వివరాలు

వైద్య శిబిరాలు	21
టీబీ పరీక్షలు చేసింది	2,121
టీబీ లక్షణాలు ఉన్నది	1,347
హెచ్ఐవీ పరీక్షలు	2008
పాజిటివ్‌గా నిర్ధారణ	5
హైపటైటిస్ బీ పరీక్షలు	129
మధుమేహవ్యాధి నిర్ధారణ	457
రక్తపోటు గుర్తింపు	640

పరీక్షలు చేస్తున్నాం



జిల్లాలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా అన్ని వార్డులు, గ్రామాల్లో సమగ్ర ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాం. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సీజనల్ వ్యాధులను కొంతవరకు అరికట్టే అవకాశం ఉంది.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

విద్యారంగం బలోపేతానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్ల సందర్శన



గంగిపల్లిలో ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్

జైపూర్: విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని పౌనూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన సదుపాయాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, బడియట పిల్లలు, మానివేసిన పిల్లలను తిరిగి చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలకు ఆహారం, అవసరమైన మందులు అందించాలని పేర్కొన్నారు. అనంతరం శివ్వారం ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు, వంటశాల పరిసరాలు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. డీసీఎంఎస్ ఫార్మర్ సర్వీస్ సెంటర్‌లో ఎరువులు, విత్తనాల నిల్వలు, రిజిష్టర్లు పరిశీలించారు. గంగిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, జైపూర్‌లోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు కార్డులు జారీ చేయాలి, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచిర్యాల ఇంచార్జి కమిషనర్‌గా సంపత్‌కుమార్

- రెండ్రోజులకే మారిన వైనం
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్‌గా లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ కే.సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల కమిషనర్ శివాజి ఈ నెల ఒకటి నుంచి 15వరకు సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ కుమార్ దీపక్ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్‌కు కమిషనర్(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నెల 2న ఆయన బాధ్యతలు చేపట్టారు. రెండ్రోజుల వ్యవధిలోనే ఆయనను తొలగించి ఇటీవల పదోన్నతిపై లక్సెట్టిపేటకు వచ్చిన కమిషనర్ సంపత్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్ పరిధి ఎక్కువ, జిల్లా కేంద్రం కావడం, ఇక్కడ రెగ్యులర్ కమిషనర్ ఉంటేనే ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. లక్సెట్టిపేటకు రెగ్యులర్ కమిషనర్‌గా పనిచేస్తూ, మంచిర్యాలకు ఇంచార్జి బాధ్యతలు నిర్వర్తించడం కష్టమే. మొత్తానికి మంచిర్యాల రెగ్యులర్ కమిషనర్ సెలవుపై వెళ్లడం, ఇంచార్జీలను మారుస్తుండడంతో కార్పొరేషన్ కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పాలకవర్గం లేకపోవడం, వర్షాకాలంలో మెరుగైన పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పనులపై ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

ఆదివాసీలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

దండేపల్లి: జన్నారం మండలం కోలాంగూడకు చెందిన ఆదివాసీలు ఆత్రం రాజు, అతడి కుమారులు రవికుమార్, సుధాకర్‌లను వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం దండేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీల గుడిసెలు, కుల దైవం భీమన్న దేవుని గుడిపై అటవీ అధికారులు దాడి చేసి ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆత్రం రాజు, అతడి ఇద్దరు కుమారులను అకారణంగా అరెస్టు చేశారని ఆరోపించారు. విడుదల చేయని పక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సేన జిల్లా కోశాధికారి మర్సు కొల సంతోష్, రాజ్‌గోండ్ సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంద్రం నరేందర్, నాయకులు టేకం భీంరావ్, అడ్డె తిరుపతి, అడ్డె భగవంత్‌రావ్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అటవీశాఖ అధికారుల దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: అటవీ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివాసీలపై అక్రమంగా కేసులు బనాయించి హింసకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జన్నారం మండలం తపాలాపూర్‌లో ఆదివాసీల దైవం భీమన్నదేవుని గుడిని అటవీ అధికారులు ధ్వంసం చేయడం అన్యాయమని అన్నారు. దీనిపై నిలదీసిన ఆత్రం రాజు, అతడి ఇద్దరు కుమారులు రవికుమార్, సుధాకర్‌లపై అక్రమ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్, ప్రేంకుమార్, మిడివెళ్లి రాజు, అరిగెల మహేష్, మోహన్ పాల్గొన్నారు.


నీటి వనరులపై శిక్షణ



మాట్లాడుతున్న సీపీవో పూర్ణచంద్రరావు

మంచిర్యాలఅగ్రికల్చర్: 7వ చిన్న తరహా, 2వ నీటి వనరుల గణనపై మండల ప్రణాళిక, గణాంక అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో) వి.పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రణాళిక, గణాంక అధికారులకు ఏర్పాటు చేసిన నీటి వనరుల గణనపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నీటి వనరులను గ్రామాలు, వనరుల వారీగా గణన చేసేందుకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ పొందిన అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి, డివిజనల్ ఉప గణాంక అధికారి, కార్యాలయ ఉప గణాంక అధికారి, మండల ప్రణాళిక, గణాంక అధికారులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గేను కలిసిన ప్రేమ్‌సాగర్‌రావు



ఖర్గేతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ

మంచిర్యాలటౌన్: ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కలిశారు. గురువారం ఆయనను హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ నెల 4న గ్రామస్థాయి కాంగ్రెస్ నేతలతో ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు ఖర్గే హాజరు కానుండగా సభ నిర్వహణపై చర్చించారు. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో పదవిని ఆశించి భంగపడిన నాయకులతో ఖర్గే ప్రత్యేకంగా మాట్లాడగా, ప్రేమ్‌సాగర్‌రావుతోనూ చర్చించినట్లు సమాచారం.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

పాతమంచిర్యాల: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఇతర రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేస్తున్న విధంగా మన రాష్ట్రంలోని ఉద్యోగులకు వర్తింపజేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డి.బాపు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్‌ఎంలో పదేళ్ల పని చేసిన వారికి రెగ్యులరైజ్ చేయాలని, 2018లో జీవో నంబరు 510 ద్వారా నష్టపోయిన ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్ ఉద్యోగులకు క్యాడర్‌ఫిక్షేషన్ చేసి బేసిక్ వేతనం అమలు చేయాలని పేర్కొన్నారు. 2018 పీఆర్‌సీకి సంబంధించిన ఏడు నెలల ఏరియర్స్ విడుదల చేయాలని తెలిపారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కళావతి, వాణి, భాగ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరు గ్యారంటీలపై ముఖరా(కే)లో పోస్టర్లు

• ట్వీట్ చేసిన కేటీఆర్



కేటీఆర్ చేసిన ట్వీట్

ఇచ్చోడ: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండలంలోని ముఖరా కే గ్రామంలో ఇంటింటా పోస్టర్లు అతికించి నిరసన తెలిపారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన యువకుడు ట్విట్టర్ లో పోస్టు చేశాడు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్ చేస్తూ ముఖరా కే గ్రామ యువత, మహిళలను, గ్రామస్తులను అభినందించారు.

మహిళను కాపాడిన పోలీసులు



కాపాడిన మహిళతో పోలీస్ సిబ్బంది

బాసర: బాసర గోదావరి మొదటి ఘాట్ వద్ద గురువారం ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు కాపాడారు. మహారాష్ట్రలోని బోకర్ తాలూకా హంస గ్రామానికి చెందిన మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించగా ఏఎస్సై గంగాధర్, సిబ్బంది ఐకే రెడ్డి ఆమెను కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

దూడను చంపాడని కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల వాగొడ్డుపల్లెకు చెందిన రాగంశెట్టి మహేందర్ తన దూడను క్రూరత్రతో బాది చంపాడని అదే గ్రామానికి చెందిన రాగంశెట్టి అంకుల్‌పై హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అంకుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో రిటైర్డ్ ఉద్యోగి ధనలక్ష్మి ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా మధ్యాహ్నం సమయంలో ఫ్రిడ్జ్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. ఘటనలో ఇంట్లోని సామగ్రి కాలిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పివేశారు. ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు డ్రైవర్‌పై ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని దేవాపూర్‌కు చెందిన కిష్టన్న రిమ్స్‌లో చికిత్స పొంది ఇంటికి వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌక్‌లో బుధవారం రాత్రి కారు ఢీకొట్టడంతో గాయాల పాలయ్యాడు. బాధితుడి తండ్రి జటంగుల విజయ్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీత్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యానికే కార్మిక చట్టాల రద్దు

పాతమంచిర్యాల: ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల రద్దుకు పూనుకుందని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, ఖలిందర్ అలీఖాన్ దాగం మల్లేశ్, జోగుల మల్లయ్య, లింగం రవి, సీపీఎం నాయకులు రంజిత్, దూలం శ్రీనివాస్, ప్రేంకుమార్, రాజు, న్యూ డెమోక్రసీ నాయకులు దొండ ప్రభాకర్, లాల్‌కుమార్, శ్రీకాంత్, అరుణ, చిన్నయ్య, రమేశ్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మె విజయవంతం చేయాలి

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్పనర్సయ్య, బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు రాజమౌళి, లక్ష్మీనారాయణ కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి తిలక్ అంబేద్కర్, నాయకులు రత్నం రాజం, బి.రాంచందర్, రాజేందర్, రాయమల్లు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చదువులు సాగేదెలా..?

• కేజీబీవీలకు ఇంటర్ పుస్తకాల సరఫరాలో జాప్యం
• విద్యార్థినులకు తప్పని ఎదురుచూపులు



తరగతి గదిలో విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు విద్యనందిస్తున్న కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాల సరఫరాలో జాప్యం జరుగుతోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటినా పుస్తకాలకోసం విద్యార్థినులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఆరు నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థినులకు మాత్రమే పుస్తకాలు రాగా ఇంటర్ విద్యార్థులకు రాకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. విద్యార్థులకు చదువుకునేందుకు, అధ్యాపకులు బోధించే పాఠాలు అర్థమయ్యేందుకు పాఠ్యపుస్తకా లు ఎంతో అవసరం. పాఠ్యపుస్తకాలు లేక ఏపాఠం విన్నారో..ఎలా చదవాలో..అర్థంకాని పరిస్థితి నెలకొంది.

15 కళాశాలల్లో ఇంటర్ చదువులు

మంచిర్యాల జిల్లాలోని 18 కేజీబీవీల్లో 6 నుంచి ఇంటర్ వరకు 4,586 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 15 చోట్ల ఇంటర్మీడియట్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. మంచిర్యాల, లక్సెట్టిపేట్, జైపూర్, బెల్లంపల్లి, చెన్నూర్ లో బైపీసీ, ఎంపీసీ కోర్సులు ఉన్నాయి. జన్నారం, తాండూర్, మందమర్రి, నస్పూర్, నెన్నెలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ఉన్నాయి. ప్రతీ కోర్సులో 40 మంది చొప్పున విద్యార్థులు చదువుతున్నారు. హాజీపూర్‌లో బైపీసీ, ఎంఎల్‌టీ, కోటపల్లిలో బైపీసీ, కన్నెపల్లిలో బైపీసీ, దండేపల్లిలో ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్స్, వేమనపల్లిలో ఎంఎల్‌టీ కోర్సులు ఉన్నాయి. ఆయా కోర్సుల్లో చేరిన వారికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. కానీ ఈ విద్యాసంవత్సరం ఇప్పటి వరకు ఒక్క పుస్తకం కూడా రాలేదు. దీంతో కొన్నిచోట్ల పాత పుస్తకాలనే సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా ఇంటర్ ప్రవేశపెట్టిన కేజీబీవీల్లో పుస్తకాలు లేక బోధన ముందుకు ఎలా సాగుతుందో అధికారులకే తెలియాలి. నెలన్నర దాటిపోతుండటంతో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలని పలువురు విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాగానే ఇస్తాం

త్వరలోనే పుస్తకాలు వచ్చే అవకాశా ఉన్నాయి. రాగానే విద్యార్థినులకు పంపిణీ చేస్తాం. జిల్లాకు అవసరమైన ఇండెంట్ గతంలోనే పంపించాం. హైదరాబాద్ నుంచి నేరుగా ఆయా కస్తూర్బాలకు పుస్తకాలు సరఫరా అవుతాయి. విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా పాత పుస్తకాలు సర్దుబాటు చేశాం. - యశోధర, జీసీడీవో, మంచిర్యాల

అనుమానమే పెనుభూతమై..



హత్యకు గురైన తులసి



ఒంటరిగా మిగిలిన చిన్నారి రేష్మ

• భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
• మంచిర్యాల జిల్లా మెట్టుపల్లిలో ఘటన

భీమిని: మూడుముళ్లు ఏడడుగులువేసి ఆమెతో కలకాలం కలిసుంటానని బాస చేసిన భర్తే ఆమె పాలిట కాలయముడై అతి దారుణంగా గొడ్డలితో నరికి చంపిన ఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని మెట్టుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కన్నెపల్లి మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల తిరుపతికి కుమురంభీం జిల్లా దహెగాం మండలంలోని బమన్‌నగర్ గ్రామానికి చెందిన తులసి (35)తో పద్నాలుగేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఐదేళ్ల క్రితం కూతురు జన్మించింది. కొంతకాలంగా తిరుపతి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్యను అనుమానిస్తూ ఉండేవాడు. గురువారం తెల్లవారుజామున తులసి మంచంపై పడుకుని ఉండగానే మద్యం మత్తులో గొడ్డలితో నరికి హతమార్చాడు. స్థానికులకు ఫోన్‌చేసి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని తాండూర్ సీఐ కుమారస్వామి పరిశీలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, మృతురాలి తండ్రి దుర్కే శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

తల్లి కాటికి, తండ్రి జైలుకు..

కన్నతల్లి చనిపోయిన ఆ చిన్నారికి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. తల్లి కాటికి తండ్రి జైలుపాలు కావడంతో ఆమె ఆలనాపాలన చూసేవారు లేకపోవడంతో ఒంటరిగా మిగిలింది. ఇంటివద్ద అంత అలజడి జరుగుతుంటే ఆ చిన్నారి అమ్మా.. అమ్మా.. అని ఏడుస్తుండడం అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు.

దొంగను పట్టించిన బైక్ నంబర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై అశోక్

కుంటాల: మహిళ మెడలో నుంచి గొలుసు చోరీకి యత్నించిన దొంగను బైక్ నంబర్ ఆధారంగా పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు గత నెల 30న తమ కుమారుడితో కలిసి బైక్‌పై కుభీర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కల్లూరు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలో నుంచి గొలుసు చోరీకి యత్నించాడు. వెనుక నుంచి వస్తున్న అందకూర్ గ్రామానికి చెందిన రవి గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని వెంబడించి నంబర్ నోట్ చేసుకున్నాడు. బైక్ నంబర్ ఆధారంగా నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ గ్రామానికి చెందిన సాయికిరణ్‌గా గుర్తించారు. గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



సంఘటనస్థలంలో గాయపడిన డ్రైవర్ మారుతి

రెబ్బెన: మండ ల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీవద్ద జాతీయ రహదారిపై గురువారం డివైడర్‌ను ఢీకొట్టి ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. రెబ్బెన వైపు నుంచి పులికుంట వైపు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తాపడింది. పులికుంటకు చెందిన డ్రైవర్ దుర్గం మారుతికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. ఎస్సై చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అరగంటయినా రాని అంబులెన్స్

జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి చేర్చేందుకు నేషనల్ హైవే అధికారులు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతారు. గురువారం జరి గిన ఘటనపై స్థానికులు అంబులెన్స్‌కోసం నేషనల్ హైవే అధికారులకు ఫోన్‌చేస్తే అరగంట దాటినా అంబులెన్స్ రాలేదు. డ్రైవర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో 108కు సమాచారం అందించగా వాహనంలో మంచిర్యాలకు తరలించారు. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించాక నేషనల్ హైవే అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుంది. అయితే ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే సకాలంలో సంఘటన స్థలానికి చేరుకోవాల్సిన నేషనల్ హైవే అంబులెన్సు తీవ్ర జాప్యం చేస్తూ ఆలస్యంగా రావడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

రూ.63 వేల విలువైన దేశీదారు ధ్వంసం



మద్యం పారబోస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

రెబ్బెన: పోలీసుల తనిఖీలో పట్టుబడిన రూ.63వేల విలువైన దేశీదారు బాటిళ్లను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది ధ్వంసం చేశారు. గత డిసెంబర్ 31న రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద రెబ్బెన పోలీసులు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న 18 కాటన్ల దేశీదారు బాటిళ్లు లభ్యమయ్యాయి. పట్టుబడిన మద్యం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చగా గురువారం ఎక్సైజ్, స్థానిక పోలీస్ సిబ్బంది బాటిళ్లను జేసీబీతో ధ్వంసం చేశారు.

నాటుసారా పట్టివేత

మండల కేంద్రంలోని ప్రగతినగర్‌కు చెందిన లావుడ్య రమేశ్ వద్ద 3 లీటర్ల నాటుసారాను పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ రమేశ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు కమలాకర్, మమత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బెల్లం, పటిక

కాగజ్‌నగర్‌టౌన్/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని చింతలమానెపల్లి మండలంలో గురువారం నాటుసారాకు ఉపయోగించే బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రఘురామ్, జిల్లా అధికారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారా, 1800 కిలోల పటిక, క్వింటాలు బెల్లం, నాటుసారా తయారీ పదార్థాలను సరఫరా చేసే స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి రణవెల్లి గ్రామానికి చెందిన జటోత్ నారిబాయి, లంబడిహెట్టికి చెందిన అజ్మీర శ్యామ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన ముడి సరుకు విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్సైలు లోబానంద్, సురేష్, సిబ్బంది మల్లేశ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పైనుంచి దూకి ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్: బ్రిడ్జిపై నుంచి దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మహాగాం గ్రామానికి చెందిన కుంటాలోళ్ల రాకేశ్ (25) కిరాణా దుకాణం నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చేమార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం గుండేగాం సమీపంలోని వంతెన పైనుంచి రంగారావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సరోజ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మనస్తాపంతో ఒకరు..

మామడ: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిని వివరాల మేరకు మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన అలకుంట గంగాధర్ (42) కుమార్తెకు వివాహం చేసిన కొన్నిరోజులకే విడాకులయ్యాయి. దీంతో మనస్తాపం చెందాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మానాన్నలేని జీవితం వద్దని యువకుడు..

మంచిర్యాలక్రైం: అమ్మానాన్నలేని ఒంటరి జీవితం నాకొద్దని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని వొడ్డెర కాలనీలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు కోట సునీత, రాజయ్య దంపతుల కుమారుడు ఉపేందర్ (19) తల్లి సునీత చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి రాజయ్య మరో వివాహం చేసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి స్థానిక వొడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న అమ్మమ్మ సూర రాజమ్మ వద్ద పెరిగాడు. కూలీపని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తల్లిదండ్రులు గుర్తుకు వచ్చినప్పుడల్లా మద్యం సేవించి మర్చిపోయేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది అమ్మానాన్న లేని జీవితం నాకెందుకని గురువారం ఇంటి సమీపంలో జామచెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీ..కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులోని రహదారిపై మూలమలుపు వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ నుంచి పెద్దంపేట వెళ్తున్న పెట్టెం సుధాకర్, గొల్లపల్లికి చెందిన మేకల పోచయ్య వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పెట్టె సుధాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని బంధువు ముక్కెర కుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేకల పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విధులను ఆటంకపర్చిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు విధులను ఆటంకపర్చిన ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన నర్సిములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. గత నెల 18న ఓ కేసులో పోలీసు స్టేషన్‌కు నర్సిములును పిలిపించగా స్టేషన్‌లోనే ఆందోళనకు దిగాడు. పోలీసు విధులను ఆటంకపర్చడంతో రిసెప్షనిస్టు అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

యాప్ ఓపెన్‌తో ఖాతాలో రూ.50 వేలు మాయం

జన్నారం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో సెల్‌కు వచ్చిన ఒక యాప్ మెసేజ్‌ను ఓపెన్ చేసిన వ్యక్తి ఖాతాలోంచి రూ.50 వేలు మాయమయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్ ఉపాధి నిమిత్తం కొంతకాలంగా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం తన ఫోన్‌కు ఎస్‌బీఐ రివార్డు పేరుతో ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేయడంతో తన ఖాతాలో నుంచి రూ.50 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చిందని బాధితుడు వాపోయాడు. సైబర్ నేరగాళ్ల పనే అయిఉంటుందని కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ట్రిపుల్‌ఐటీలో పారిశుద్ధ్య కార్మికుల విధుల బహిష్కరణ

• వర్సిటీని సందర్శించిన ఏసీఎల్
• పెండింగ్ వేతనాలు ఇప్పించిన అధికారులు



ట్రిపుల్‌ఐటీ ఎదుట బైఠాయించిన కార్మికులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విధులు బహిష్కరించి ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికుల వేతనాల్లో కోతలు, భారీ అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు ఉన్నాయి. గడువు ముగిసినా ప్రైవేటు సంస్థకే పనులు పొడగించారని ప్రధాన ఆరోపణ ఉంది. 2021లో ప్రైవేటు సంస్థ ఏడాది గడువుతో పారిశుద్ధ్య నిర్వహణ దక్కించుకుంది. 2022లో కాంట్రాక్టు గడువు ముగిసినా అధికారులు అదే సంస్థకు పొడగిస్తున్నారు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏసీఎల్ చేరుకుని...

కార్మిక శాఖ సహాయ కమిషనర్ ముత్యంరెడ్డి బాసర క్యాంపస్‌కు చేరుకుని విధులు బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను కలిశారు. సమస్యలు అడిగితెలుసుకున్నారు. తమకు ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించడంలేదని, ఇతర సమస్యలు ఉన్నాయని వివరించారు. దీంతో సహాయ కమిషనర్ ట్రిపుల్‌ఐటీ ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్‌తో పాటు ఇతర అధికారులతో చర్చించి మే నెల వరకు కార్మికుల వేతనాలను ఇప్పించారు. జూన్ వేతనాలను ఈనెల చెల్లించేలా చూడాలని సంబంధిత సంస్థను ఆదేశించారు. వేతనాలు అందడంతో కార్మికులు విధుల్లో చేరారు.

‘ది స్టూడెంట్ మ్యాగజైన్’ ఆవిష్కరణ



ది స్టూడెంట్ మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, అధికారులు, విద్యార్థులు

బాసర: బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) విద్యార్థుల మాసపత్రిక ‘ది స్టూడెంట్ మాగజైన్’ను గురువారం ఆవిష్కరించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, వోఎస్డీ డాక్టర్ ఈ.మురళీధర్, డాక్టర్ పి.చంద్రశేఖరరావు, డాక్టర్ ఎస్.విఠల్, డాక్టర్ టి.రాకేశ్‌రెడ్డి, నాగరాజు తదితరులు సంచికను విడుదల చేశారు. ఈ మ్యాగజైన్‌లో యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏప్రిల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు, విద్య, సాంస్కృతిక, క్రీడారంగాల్లో విద్యార్థుల సాధనలను పొందుపర్చారు. పత్రికలో విద్యార్థుల కథనాలు, సృజనాత్మక రచనలు, విజయాలు, వినూత్న ఆవిష్కరణలు, సామాజిక సేవా కార్యక్రమాలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతినెలా విడుదలయ్యే ఈ పత్రిక, విద్యార్థులకు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, సామాజికవర్గాలకు విద్య, పర్యావరణంపై అవగాహన కల్పించనున్నారు. విద్యార్థుల ఎడిటోరియల్ బృందం, డాక్టర్ టి.రాకేశ్‌రెడ్డి మార్గదర్శనంలో ఈ పత్రికను రూపొందించింది.

కళలు సంస్కృతికి ప్రతిబింబాలు



ఎన్నికైన సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరే..


నిర్మల్‌ఖిల్లా: కళలు సాంస్కృతిక వైభవాన్ని చాటే ప్రతిబింబాలని, కళాకారులు సాంస్కృతిక వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ముందుకు సాగాలని చలనచిత్ర, టీవీ కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడిచర్ల రాజు, జన్ను అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో చలనచిత్ర టీవీ కళాకారులు ప్రత్యేక అభిరుచితో తమ ప్రతిభను చాటుతూ రాణిస్తున్నారన్నారు. వీరి సంక్షేమం కోసం సంఘం తరపున తగిన కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అడిచర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా జన్ను అనిల్‌కుమార్, కోశాధికారిగా సామెర్ల రాజన్న, ఉపాధ్యక్షులుగా చెట్‌పల్లి కమలాకర్, నరసయ్యచారి, వెన్నెల రాజేందర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కత్తి కిరణ్, ప్రచార కార్యదర్శిగా గర్దాసు నరేందర్, సహాయ కార్యదర్శిగా కృష్ణవర్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాం రమేశ్, ఎర్ర రవీందర్, సలహాదారులుగా టీఎస్జీవో ప్రభాకర్, పురుషోత్తం, మోహన్‌రావు ఎన్నికయ్యారు.

ప్రకృతి ఒడిలో పంటల సాగు

వర్షాకాలంలో ప్రకృతి పచ్చదనాన్ని సంతరించుకోవడం సహజమే. అయితే ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతం ప్రకృతి రమణీయతను తెలియజేస్తోంది. ఇరువైపులా ఉన్న కొండల నడుమ సాగవుతున్న వివిధ రకాల పంటలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అడవి ఒడిలో సాగవుతున్న పంటలు



భగీరథ పగిలింది..బావి నిండింది



మిషన్ భగీరథ నీటితో కోతకు గురైన బావి

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో మండలంలోని లక్ష్మీపూర్‌లో చొప్పదండి రాజంకు చెందిన వ్యవసాయ బావి వరదతో పొటెత్తి పొంగిపొర్లింది. రూ.2 లక్షలు వెచ్చించి తవ్వించుకున్న బావి భగీరథ నీటితో దెబ్బతిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై మిషన్ భగీరథ గ్రిడ్ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌ను వివరణ కోరగా తాము పైపులైన్ వేసిన కింద నుంచి బావిని తవ్వడంతో పైపులైన్ దెబ్బతిని లీకేజీకి కారణమైందన్నారు.

– కడెం